# 'సన్'తోషం

"హలో...! అమ్మా! నేనూ ! శ్రీధరాన్ని"

అన్నపూర్ణ కళ్ళల్లో ఆనందం మెరిసింది.

"అందరూ బావున్నారా?" ఉత్సాహంగా అడిగింది.

"అంతా బావున్నాం! నిన్న నాన్నగారు రిటైరయ్యారుగా ! అందుకే శుభాకాంక్షలు చెప్దామని ఫోన్ చేశా..!"- చెప్పాడు.

"అలాగా ! లైన్లో వుండు!" అంటూ భర్తను పిలిచింది.

"కంగ్రాచ్యులేషన్స్ నాన్నగారూ! మీ పదవీ విరమణ జీవితం ప్రశాంతంగా సాగిపోవాలని కోరుకుంటున్నాను".

"థ్యాంక్స్ రా!"

"మీ ఆఫీసు వాళ్ళు 'ఫేర్ వెల్ పార్టీ' బాగా చేశారా" అడిగాడు శ్రీధరం.

"ఓ ! బ్రహ్మాండంగా చేశారు!"

"మీకు రావాల్సిన 'రిటైర్‌మెంట్ బెనిఫిట్స్' అన్నీ వచ్చాయా?"

"ఆ! మొత్తం నాలుగు లక్షల దాకా వచ్చింది. ఇంకేమిటీ విశేషాలూ?"

"ఏమున్నాయ్? అంతా మామూలే! ఇక్కడ ఆ మధ్య స్థలం కొన్నాను కదా? అందులో 'కన్‌స్ట్రక్షన్' మొదలెట్టాలనుకుంటున్నాను!" చెప్పాడు శ్రీధరం.

"శుభం" - రమణయ్య తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

"అన్నట్టు - నేనివాళ గోదావరిలో బయల్దేరి హైదరాబాద్ వస్తున్నా" ఫోన్ పెట్టేసే ముందు చెప్పాడు శ్రీధరం.

"రేపు ఉగాది పండక్కదా! అందుకే అబ్బాయి వస్తున్నాడు కాబోలు. అమ్మాయిని కూడా రమ్మని ఫోన్ చేయండి. రెండు రోజులుండి వెడుతుంది" చెప్పింది అన్నపూర్ణ.

"ఇవాల్టికివాళ బయల్దేరి రావాలంటే రైల్లో రిజర్వేషన్ దొరకద్దూ! పైగా మొన్న సంక్రాంతి పండక్కీ, అదీ పిల్లలూ వచ్చి వెళ్లారు. మళ్లీ ఇంతలోనే రావాలంటే - ఆఫీసులో దానికి సెలవు దొరకాలి కదా? పైగా అది పని చేస్తున్నది ప్రయివేటు కంపెనీలో నాయె!"

అంతలో, పక్క వాటాలో వుంటున్న జగన్నాథం - చేత్తో పూల గుత్తి పట్టుకుని వచ్చాడు. "హలో రమణా! పదవీ విరమణ చేసిన సందర్భంగా నీకు నా హృదయ పూర్వక

శుభాకాంక్షలు" – అంటూ ఆ పూల గుత్తిని రమణయ్యకి అందించాడు. రమణయ్య కృతజ్ఞతా పూర్వకంగా చూశాడు.

"అసలు నిన్న సాయంత్రమే వచ్చి 'గ్రీట్' చేద్దామనుకున్నాను. కానీ మీ ఆఫీసులో 'ఫేర్‌వెల్ పార్టీ' ముగించుకుని వచ్చేసరికి నీకు ఆలస్యం అవుతుందని అశ్రద్ధ చేశా!" చెప్పాడు జగన్నాథం.

"అవున్రా జగం! నువ్వన్నట్టు నిన్న బాగా పొద్దుపోయింది. మా ఆఫీస్ స్టాఫంతా మాట్లాడేరు. మా 'బాస్' అయితే నన్ను పొగడ్తలతో ముంచెత్తేశాడనుకో!" ఆనందంగా తల్చుకుంటూ అన్నాడు రమణయ్య.

"నాకు రావాల్సిన 'రిటైర్‌మెంట్ బెనిఫిట్స్' అన్నింటికీ కలిపి చెక్కురాసి, ఓ అందమైన దంతం పెట్టెలో వుంచి నిన్నటి పార్టీలో అందచేశారు" అన్నాడు రమణయ్య కొంచెం గర్వం వుట్టిపడే స్వరంతో.

"మొత్తం ఎంతొచ్చిందేమిటి?" – యధాలాపంగా అడిగేడు జగన్నాథం.

"అన్నీ కలిపి నాలుగు లక్షల దాకా వచ్చింది"

"నా మాట విని ఆ డబ్బంతా ఏ బ్యాంకులోనో వేసుకో! వచ్చే వడ్డీ తక్కువే అయినా 'అసలు' భద్రంగా వుంటుంది! రిటైరయ్యావు కనుక మీ ఆవిడతో కలిసి నాలుగు పుణ్యక్షేత్రాలు తిరిగిరా!" అంటూ జగన్నాథం ఏమిటేమిటో చెప్పబోతూంటే – అతన్ని వారిస్తూ అన్నాడు రమణయ్య–

"ఒరేయ్! రిటైర్‌మెంట్ అనేది ఉద్యోగానికే కానీ, నా వయసుకీ జీవితానికీ కాదురా! కొంతకాలం పిల్లల బాధ్యతతో సరిపోయింది. నిన్నటి దాకా ఉద్యోగపు బరువుతో చెల్లిపోయింది. ఇక ఇపుడు-నేను 'ఫ్రీబర్డ్'నిరా! హాయిగా ఎంజాయ్ చేయాలి కానీ హిమాలయాలకు వెళ్ళి తపస్సు చేసుకోమంటే ఎలా?"

"అదీ నిజమే! మన జేబులో డబ్బూ, ఒంట్లో ఓపికా వున్నప్పుడే జీవితాన్ని అనుభవించాలి. నేనూ ఉన్నాను ఎందుకూ? అన్నీ తెలిసి ముందు చూపు లేకుండా నిండా మునిగిపోయాను". దిగులు నిండిన స్వరంతో చెప్పాడు జగన్నాథం.

"ఏమైందన్నయ్యా!" అర్థం కానట్టు చూస్తూ అడిగింది అన్నపూర్ణ.

"అదేనమ్మా! నేను రిటైరైనప్పుడు వచ్చిన డబ్బులో రెండు లక్షలు – ఆ ఫైనాన్స్ కంపెనీ వాళ్ళ ఎదాన కొట్టానా? తక్కిన మూడు లక్షలూ కన్న కొడుకు కొల్లగొట్టుకుపోయాడు! ఇపుడా పెన్షన్ డబ్బులే మాకు గతయ్యాయి".

"పోనీ మీరే వెళ్లి మీ అబ్బాయి దగ్గర ఉండాల్సింది" – అన్నపూర్ణ ఉచిత సలహా అందించింది.

"ఆ భోగమూ అయిందిగా? తీరా మేం అక్కడకు వెళ్లగానే – వాళ్ళింట్లో పని మనిషినీ, దోబీనీ మాన్పించేసి ఇంటెడు చాకిరీ మాకు అప్పగించారు. వాళ్లేమో జల్సాగా తిరగటం ప్రారంభించారు. మనసుపడి ఓ సినిమాకెళ్లాలనిపించినా – అబ్బాయి ముందు చేయి చాచాల్సి వచ్చేది...! అయినా తన చేను పాలెకిచ్చి తాను కూలికెళ్లే పరిస్థితిని తెచ్చుకోకూడదమ్మా!" నిట్టూర్చాడు జగన్నాథం.

"అన్నట్టు రేపు మా ఇంటికి భోజనానికి రారా జగం. విశాఖపట్నం నించి రేపు మా శ్రీధరం వస్తున్నాడు... సరదాగా కల్సి భోంచేద్దాం".

"ఏదైనా పని మీద వస్తున్నాడా?"

"అలాంటిదేం లేదు... వట్టినే మమ్మల్ని చూట్టానికి వస్తున్నట్టున్నాడు!"

"అలా అయితే ఫరవాలేదు. ఒకవేళ, రిటైరైన సందర్భంగా నీకొచ్చిన సొమ్ముకి 'టెండరు' పెట్టాలని వస్తున్నాడేమో అనుకున్నాను. ఏది ఏమైనా నాలాగా 'సన్‌స్ట్రోక్' తినకండి!"–సలహా ఇచ్చాడు. ఆ తర్వాత మరి కాసేపు పిచ్చాపాటీ మాట్లాడి వెళ్లిపోయాడు జగన్నాథం.

" 'సన్‌స్ట్రోక్' అంటాడేమిటండీ అన్నయ్య?" అతను వెళ్లిపోయాక, భర్తను అడిగింది అన్నపూర్ణ.

"సన్, అంటే కొడుకు ! వాళ్ళబ్బాయి వాడికి దెబ్బకొట్టాడుగా! 'సన్‌స్ట్రోక్' అంటే అదీ! అందుకని మన జాగ్రత్తలో మనల్ని వుండమంటూ హెచ్చరించాడన్నమాట!" వివరించాడు రమణయ్య.

ఆ రాత్రి ఎంత పొద్దుపోయినా, రమణయ్యకి నిద్రపట్టలేదు. ఉదయం జగన్నాథం చెప్పిన 'సన్‌స్ట్రోక్' గురించే ఆలోచిస్తున్నాడు. ఒక వేళ శ్రీధరం కూడా, 'తన దగ్గరున్న డబ్బు అడగటానికే రావటం లేదు కదా?" అనుకున్నాడు.

అలా ఇంకా ఆలోచిస్తూనే నెమ్మదిగా నిద్రలోకి జారిపోయాడు.

ఇంకా పూర్తిగా తెల్లవారకుండానే 'డోర్ బెల్' మోగింది.

'అదిగో శ్రీధరం వచ్చేసినట్టున్నాడు!' అనుకుంటూ ఉత్సాహంగా వెళ్లి తలుపు తీసింది అన్నపూర్ణ. గుమ్మంలో ఎదురుగా బ్రీఫ్ కేసుతో కనిపించిన కూతుర్ని చూసి ఆశ్చర్యపోయింది.

"ఏవండీ! అమ్మాయొచ్చింది!" అంటూ ఆనందంగా లోపలకు చూసి కేక పెట్టింది.

"ఏమిటమ్మా! చెప్పా పెట్టకుండా హఠాత్తుగా వచ్చేశావ్? ఫోన్ చేస్తే, నిన్ను 'రిసీవ్' చేసుకోటానికి స్టేషన్ కొచ్చేవాణ్ణిగా?' లోపల్నించి వచ్చిన రమణయ్య అరుణ వైపు ఉత్సాహంగా చూస్తూ అడిగాడు.

"మిమ్మల్ని 'సర్‌ప్రైజ్' చేయాలనే అలా ఫోన్‌లో చెప్పకుండా వచ్చాను. పైగా మీరు రిటైరయ్యారు కదా! ఫోన్‌లో శుభాకాంక్షలు చెప్పే బదులు స్వయంగా చెప్పాలనీ"–అంటూ ఇంకా ఏమిటేమిటో మాట్లాడేస్తోంది అరుణ. కానీ రమణయ్యకి ఆ మాటలు వినిపించటం లేదు. అతని ఆలోచనలు వేరుగా వున్నాయి.

"బహుశా అరుణ కూడా – తన కొచ్చిన 'రిటైర్‌మెంట్ బెనిఫిట్స్' తాలూకు డబ్బులో వాటా అడగాలని వచ్చిందేమో?" అనుకున్నాడు.

"అన్నయ్య రాలేదామ్మా"? అంతలో అరుణ అడిగింది.

"అన్నయ్యొస్తున్నట్టు నీకెలా తెలుసు?" వెంటనే అడిగాడు రమణయ్య.

"నాకు నిన్న ఫోన్ చేసి చెప్పాడు. అందుకే నేనూ వచ్చాను".

విషయాన్ని ఊహించుకోగలిగేడు రమణయ్య. ఇద్దరూ కూడబలుక్కుని డబ్బు కోసమే వచ్చి వుంటారని నిర్ధారణ చేసుకున్నాడు.

మరి కాసేపటికి శ్రీధరం కూడా రానే వచ్చాడు.

"ఏమిటమ్మా, అంత చిక్కిపోయావ్? నాన్న గారు రిటైరయ్యారని బెంగ పెట్టుకున్నావా?" వస్తూనే గుమ్మంలో ఎదురైన తల్లిని చూసి ప్రశ్నించాడు. తల్లి మీద తనయుడికి అంత ప్రేమ పుట్టుకొచ్చిందంటే – తట్టలో పెట్టి బుట్ట బోర్లించబోతున్నాడని ఊహించాడు రమణయ్య.

భోజనాలయ్యాక అందరూ హాల్లోకి వచ్చారు.

"మీ నాన్న రిటైరైన సందర్భంగా మీరిద్దరూ అంతంత దూరాల నించి వచ్చి స్వయంగా శుభాకాంక్షలు చెప్పటం నాకు నచ్చిందర్రా!" ఆ పూట అతిథిగా వచ్చిన జగన్నాథం శ్రీధరాన్నీ, అరుణనీ అభినందన పూర్వకంగా చూస్తూ అన్నాడు.

రమణయ్య మాత్రం ముభావంగా వుండిపోయాడు. 'తన దగ్గరున్న డబ్బు, వాళ్లు ఏ క్షణంలో అడుగుతారా' అని ఎదురు చూస్తున్నాడు. అంతకు ముందు రాత్రి భార్య సలహా ఇచ్చినట్టుగా వాళ్ళ చేత అడిగించుకోకుండా తనే వాటాలు వేసేయాలని కూడా అనుకుంటున్నాడు.

అంతలో శ్రీధరం – అసలు ప్రస్తావన తెచ్చాడు.

"ఇక్కడ మా ఫ్రెండొకడు రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్నాడు. అతనితో మాట్లాడి – అమ్మ పేరు మీద ఓ ఫ్లాట్ బుక్ చేశాను." అంటూనే దానికి సంబంధించిన కాగితాలన్నీ తన బ్యాగ్‌లోంచి తీసి – తల్లి చేతికి అందించి – ఆమె పాదాలకు నమస్కారం చేశాడు శ్రీధరం.

రమణయ్య, జగన్నాథం వింతగా చూస్తున్నారు. అదే క్షణంలో తన హేండ్ బ్యాగ్‌లోంచి ఓ చిన్న పర్సు తీసి తండ్రికి అందిస్తూ చెప్పింది అరుణ.

"నీ కోసం నేను కారుకొన్నాను నాన్నా! ఈ పర్సులో 'కీ' వుంది. ఇవాళే షోరూమ్‌లో డెలివరీ తీసుకోండి. ఇక మీ రిటైర్డ్ లైఫ్ హాయిగా ఎంజాయ్ చేయండి!".

"ఏమిటమ్మా ఇదీ ! నాకు 'నువ్వు' కారుకొన్నావా?" ఆశ్చర్యం నించి తేరుకోకుండానే అడిగాడు రమణయ్య.

"ఔన్నాన్నా ! మీకు గుర్తుందా? చిన్నప్పుడు నేను ఆడుకునే రోజుల్లో 'కీ' ఇస్తే తిరిగే కారు కావాలని మారాం చేశాను. అది 'చాలా ఖరీదుంటుందీ నేను కొననూ' అన్నారు. అప్పుడు అమ్మ 'అది ముచ్చట పడుతోంది పాపం కొనివ్వండీ. అది పెద్దయ్యాక మీకు లక్ష రూపాయలెట్టి మంచి కారు కొనిపెడుతుంది లెండి... అప్పుడు దర్జాగా అందులో తిరగొచ్చు' అంది. అప్పుడే అనుకున్నాను ఎలాగైనా నేను పెద్దదాన్నయ్యాక, ఉద్యోగం చేసి మీకు కారు కొనివ్వాలని!" కృతజ్ఞతా పూర్వకంగా తండ్రి వైపు చూస్తూ చెప్పింది అరుణ.

కూతురు మాటలు విన్న రమణయ్య మనసు ఆర్ద్రతతో నిండిపోయింది. తాననుకున్న దేమిటి? జరుగుతోందేమిటి?

"అది సరేసమ్మా! అసలు నువ్వీ కారూ, వాడీ వూళ్లో ఫ్లాటూ, ఎప్పుడు కొన్నారూ? ఎలా కొన్నారూ?" అత్రుతగా చూస్తూ అడిగింది అన్నపూర్ణ.

"మేం ఉద్యోగంలో చేరిన మొదటి నెల నించే డబ్బు పొదుపు చేసి వీటిని కొనగలిగేం! నాన్న గారు రిటైరైన సందర్భంగా ఆయనకు శాభాకాంక్షలు చెప్తూ వీటిని బహుమతిగా ఇవ్వాలని నేనూ, చెల్లాయీ ఏనాడో నిర్ణయించుకున్నాం!" చెప్పాడు శ్రీధరం.

"మేం పెద్దయి, మా కాళ్ళ మీద మేం నిలబడే దాకా పాతికేళ్ళపాటు మీరు రెక్కలు ముక్కలు చేసుకున్నారు. మీ సుఖాలెన్నింటినో త్యాగం చేసి మా అవసరాలు తీర్చారు. ఇప్పుడిక నాన్నగారు రిటైరయ్యారు. ఈ శేష జీవితం ఎంతో హాయిగా మరెంతో ఆనందంగా గడపాలి. అందుకే ఇలా ప్లాన్ చేశాం". అరుణ చెప్పింది.

రమణయ్య, అన్నపూర్ణా ఆనందంగా ఒకరినొకరు చూసుకున్నారు.

ఇదంతా సంభ్రమంగా చూస్తున్న జగన్నాథం అన్నాడు-

"నువ్ చాలా అదృష్టవంతుడివిరా రమణా! 'కన్నందుకు తల్లిదండ్రులే మనకు రుణపడి వుంటారనుకునే పిల్లలు ఎంతో మంది వున్న ఈ రోజుల్లో పెంచి పెద్ద చేసినందుకు కృతజ్ఞతగా తల్లితండ్రుల రుణం తీర్చుకోవాలనుకునే పిల్లలకు తల్లితండ్రులయిన మీ ఇద్దర్నీ అభినందిస్తున్నాన్రా! నా పిల్లలు నాకు 'సన్‌స్ట్రోక్' తగిలిస్తే – నీ పిల్లలు మీకు 'సన్'తోషం కలిగించారు".

ఆ మాటలు విన్న రమణయ్య పిల్లల వైపు గర్వంగా చూశాడు.

(యోజన – 2003 ఏప్రిల్)